AKSHARA TODAY

# అక్షరటుడే

TOWARDS... TRUTH. TRUST. TREND

www.aksharatoday.in

14-9-2025 NIZAMABAD / KAMAREDDY PAGES - 2

## ఆ కాలనీకి 31 వసంతాలు..!



2



2

## అదుపు తప్పి లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

## బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ

**అక్షరటుడే, నిజామాబాద్:** నగరంలోని కిడ్స్ ఫ్యూచర్ పాఠశాలలో సంస్కార భారతి ఇందూరు మహానగర్ ఆధ్వర్యంలో ఆదివారం బతుకమ్మ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రాంత సహాయ కార్యదర్శి వేణుగోపాల్ హాజరై పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేలా మహిళలకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించాలని, విజేతలకు బహుమతులు అందించాలని సూచించారు. ఈనెల 21 నుంచి 30 వరకు వివిధ ప్రాంతాల్లో మాతృశక్తి కన్వీనర్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించాలన్నారు. ప్రాంత కార్యదర్శి గంటెల ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కార్తీక్, కోశాధికారి రాధాకృష్ణ, రమణ చారిపాల్గొన్నారు.



## శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టులో పర్యాటకుల సందడి

**అక్షరటుడే, మెండోరా :** శ్రీరామ్ సాగర్ ప్రాజెక్టు వద్ద పర్యాటకుల సందడి కనిపిస్తోంది. ప్రాజెక్టులో నీటిమట్టం పెరగడంతో గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలిపెడుతున్నారు. దీంతో ఆ ఆహ్లాదకరమైన దృశ్యాలను చూసేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. ప్రాజెక్టు చుట్టుపక్కల పచ్చదనం, చల్లని గాలులు, నీటి అలల చప్పుళ్లు సందర్శకులను ఆకర్షిస్తున్నాయి. వీకెండ్ కావడంతో మరింత రద్దీ పెరిగింది. స్థానిక వ్యాపారులు, హోటల్ యజమానులు పర్యాటకుల రాకతో ఆదాయాన్ని పెంచుకుంటున్నారు. గుర్రపు స్వారీ చేసి చిన్నారులు సంబరపడుతున్నారు. అధికారులు పర్యాటకుల భద్రత కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. నీటిమట్టం పెరుగుతున్న దృష్ట్యా గేట్ల దగ్గరకి వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, సిబ్బందిని మోహరించారు.



## మురికి కూపం.. ప్రజలకు శాపం..!

**అక్షరటుడే, డోంగ్లి:** మండలంలోని లింబూర్ గ్రామంలో నీటి ట్యాంక్ వద్ద మురికి నీరు చేరి అధ్వానంగా మారింది. అక్కడి పరిసరాలు దుర్గంధంగా మారగా, దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు దోమలు వృద్ధి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని స్థానికులు వాపోతున్నారు. పారిశుధ్య నిర్వహణ పేరిట ఏటా రూ.లక్షలు ఖర్చు చేస్తున్నా.. ఆశించిన ఫలితం ఉండడం లేదు. పెరిగిన జనాభా అవసరాలకనుగుణంగా డ్రైనేజీలు లేకపోవడం, దశాబ్దాల కిందట నిర్మించినవి కావడంతో సమస్య తీవ్రంగా ఉంటోంది. సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




క్రమ శిక్షణకు మారుపేరుగా నిలవాల్సిన పోలీస్ శాఖలో కొందరు సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహిస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటున్నారు. అలాంటి వారిని గాడిన పెట్టడానికి జిల్లా పోలీస్ బాస్ చర్యలు చేపట్టారు. మార్చి 10న ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రాజేశ్ చంద్ర పోలీసు శాఖలో క్రమశిక్షణపై కఠినంగా వ్యవహరిస్తున్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఆయన బాధ్యతలు చేపట్టిన ఆరు నెలల్లోనే ఇద్దరు ఎస్సైలను సస్పెండ్ చేశారు. మరో ఇద్దరిని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేయడంతో పాటు 11 మంది కానిస్టేబుళ్లపై వేటు వేశారు. - అక్షరటుడే, కామారెడ్డి

# గీత దాటితే వేటే!

▸ విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే సస్పెన్షన్ ▸ కొరఢా ఝుళిపిస్తున్న పోలీస్ బాస్ ▸ అయినా మారని పలువురు అధికారులు ▸ దడ పుట్టిస్తున్న ఎస్పీ

జిల్లాలోని కొందరు పోలీసులు సక్రమంగా విధులు నిర్వహించడం లేదని ఆరోపణలు ఉన్నాయి. ప్రజల దగ్గర నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారనే విమర్శలు సైతం ఉన్నాయి. ఈ విషయాన్ని గమనించిన ఎస్పీ రాజేశ్ చంద్ర తనదైన శైలిలో ముందుకు సాగుతున్నారు. వచ్చిన కొత్తలో పోలీస్ స్టేషన్లను చుట్టుముట్టి పరిస్థితిని సమీక్షించారు. విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తున్న పోలీస్ సిబ్బందిపై కొరడా ఝులిపిస్తున్నారు. ఏకంగా సస్పెండ్ చేస్తూ సిబ్బందిలో దడ పుట్టిస్తున్నారు

### మారని సిబ్బంది తీరు

విధులకు గైర్హాజరవుతున్న సిబ్బందిపై ఎస్పీ నిక్కచ్చిగా వ్యవహరిస్తున్నారు. విధుల్లో అలసత్వాన్ని ఉపేక్షించడం లేదు. ఈ విషయాన్ని తాను వచ్చిన కొత్తలోనే పోలీసు సిబ్బందికి అర్థం అయ్యేలా తెలిపారు. అయినా కిందిస్థాయి సిబ్బందితో పాటు ఎస్సైలు కూడా తమ పద్ధతులు మార్చుకోవడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారుల అనుమతులు లేకుండానే విధులకు గైర్హాజరవుతున్నారు. దాంతో పోలీస్ బాస్ తనపని తాను చేసుకుంటూ పోతున్నారు.

### ఎస్పీ చర్యలు తీసుకున్న వారి వివరాలు

బాన్సువాడ కల్లు దుకాణంలో న్యూసెన్స్ చేసిన వ్యక్తులను చితకబాదిన కానిస్టేబుల్ కిరణ్, హోంగార్డు గంగాధర్‌న్ మార్చ్ 27 ఎస్పీ సస్పెండ్ చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహించడంతో పాటు బాధితుల వద్ద డబ్బులు వసూలు చేసిన ఆరోపణలపై జుక్కల్ హెడ్ కానిస్టేబుల్ అంబార్ సింగ్‌పై ఏప్రిల్ 17న వేటు వేశారు.

అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు అవుతున్న తాడ్వాయి ఎస్సై వెంకటేశ్వర్లును ఏప్రిల్ 19న సస్పెండ్ చేశారు.

ఒక వ్యక్తి మిస్సింగ్ కేసులో ఎఫ్ఐఆర్ చేయకుండా, కనీస విచారణ చేపట్టని రామారెడ్డి ఎస్సై నరేశ్‌పై ఏప్రిల్ 24న సస్పెన్షన్ వేటు వేశారు.

పాస్‌పోర్టు విచారణలో నిర్లక్ష్యం వహించిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ కృష్ణను మే 7న సస్పెండ్ చేశారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తూ పోలీస్ నియమావళి ఉల్లంఘించిన నిజాంసాగర్ కానిస్టేబుల్ మోహన్ సింగ్‌పై జూన్ 4న వేటు వేశారు.

మద్యం తాగి వాహనం నడిపి కారు ప్రమాదానికి కారణం కావడంతో పాటు విధుల్లో అలసత్వం ప్రదర్శించిన నిజాంసాగర్ కానిస్టేబుల్ రాకేష్ గౌడ్‌ను జూన్ 6న సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

జూన్ 23 న పెద్దకొడప్‌గల్‌లో విధులు నిర్వర్తిస్తున్న సమయంలో ఏఎస్ఐ సంతకాల ఫోర్జరీ చేసి దుర్వినియోగానికి పాల్పడిన దేవునిపల్లి కానిస్టేబుల్ రవికుమార్‌ను సస్పెండ్ చేశారు.

విధుల్లో బాధ్యతారాహిత్యంగా ప్రవర్తించిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ భరత్‌ను జులై 16న ఎస్పీ సస్పెండ్ చేశారు.

ఆగస్ట్ 12 న విధుల్లో అలసత్వం ప్రదర్శించిన దోమకొండ కానిస్టేబుల్ విశ్వనాథ్‌పై వేటు వేశారు. అదేరోజు పిట్లం ఎస్సై రాజును ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు.

గణేశ్ నిమజ్జనంలో నిర్లక్ష్యం వహించిన రాజంపేట ఎస్సై దత్తాద్రి గౌడ్‌ను సెప్టెంబర్ 10న ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేశారు. అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన హోంగార్డులు మొగులయ్య, సత్యనారాయణలను అదే రోజు సస్పెండ్ చేశారు.

### ఎస్పీ తీరుపై గుర్రుగా సిబ్బంది!

ఎస్పీ రాజేశ్ చంద్ర తీరుపై కింది స్థాయి సిబ్బంది గుర్రుగా ఉన్నట్లు సమాచారం. విధులకు హాజరు కాకున్నా.. నిర్లక్ష్యంగా వ్యవహరించినా పోలీస్ బాస్ ఊరుకోవడం లేదు. దీంతో కింది స్థాయి సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. కానిస్టేబుళ్లు, ఎస్సైలు మాత్రమే తప్పులు చేస్తున్నారా..? పై అధికారులు ఎలాంటి తప్పులు చేయడం లేదా అని వారు చర్చించుకుంటున్నట్లు తెలిసింది. గతంలో ఏ ఎస్పీ ఇంత కఠినంగా వ్యవహరించలేదని లోలోపల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తప్పు చేస్తున్న సిబ్బందిపై పోలీస్ బాస్ చర్యల్లో తప్పేమీ లేదన్న చర్చ కూడా సిబ్బందిలో సాగుతోంది. ప్రజలు మాత్రం ఎస్పీ తీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నిర్లక్ష్యాన్ని సహించేది లేదు

పోలీస్ నియమావళికి విరుద్ధంగా ప్రవర్తించే సిబ్బందిని ఉపేక్షించేది లేదు. విధుల్లో అలసత్వం వహించినా, అనుమతి లేకుండా గైర్హాజరైనా చర్యలు తప్పవు. పోలీస్ సిబ్బంది నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలి. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం. దానికి అనుగుణంగా ప్రతి ఒక్క సిబ్బంది పని చేయాలి.

– రాజేశ్‌చంద్ర, ఎస్పీ

## అ'పూర్వ' సమ్మేళనం..

**నగర పరిధిలోని మున్నూరుకాపు కల్యాణ మండపంలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 1991–92 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఈ సందర్భంగా అంతా ఒక్కచోట కలుసుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థి, సినీ రచయిత బండోజి సతీష్ తన వ్యాఖ్యానంతో ఆకట్టుకున్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు.** – అక్షరటుడే, ఇందూరు



## జాతీయ మెగా లోక్ అదాలత్‌లో జిల్లాకు నాల్గో స్థానం



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జాతీయ లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారంలో రాష్ట్రంలో నిజామాబాద్ జిల్లా నాల్గో స్థానంలో నిలిచిందని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. మెగా లోక్ అదాలత్‌లో 7,444 కేసులను పరిష్కరించినట్లు ఆయన పేర్కొన్నారు. లోక్ అదాలత్‌ను విజయవంతం చేసిన అధికారులను, సిబ్బందిని అభినందించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన రూ.42,45,273లను తిరిగి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. అలాగే 501 ఐపీసీ బీఎన్ఎస్ కేసులు, 138 సైబర్ క్రైం కేసులు, 1958 ఈ పెట్టి కేసులు, 4,985 ఎంవీ యాక్ట్ కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్‌అదాలత్ అనేది చక్కని పరిష్కారమని సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. రాజీ మార్గమే రాజమార్గం అని, రాజీ కుదుర్చుకోవడానికి అవకాశం ఉన్న అన్ని కేసులల్లో ఇరు వర్గాలు రాజీపడవచ్చన్నారు. ముఖ్యంగా సైబర్ బాధితులకు సత్వర న్యాయం చేయాలనే ఉద్దేశంతో (తెలంగాణ రాష్ట్ర సైబర్ సెక్యూరిటీ బ్యూరో) డైరెక్టర్ శిఖాగోయల్ ఐపీఎస్ ఆధ్వర్యంలో 7 కమిషనరేట్ పరిధిల్లో సైబర్ క్రైమ్ పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేశారన్నారు. జిల్లాలో నమోదైన సైబర్ నేరాల్లో లోక్‌అదాలత్‌లో 138 సైబర్ క్రైమ్ కేసులలో రూ.42,45,273 బాధితులకు ఇప్పించేందుకు కృషి చేశామన్నారు.



## ఖబడ్దార్ అర్వింద్.. తప్పుడు మాటలతో ప్రజలను మభ్యపెట్టొద్దు

**అక్షరటుడే నిజామాబాద్ సిటీ:** కేంద్రం నుంచి రావాల్సిన యూరియా రాకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతుంటే.. ఎంపీ అర్వింద్ మాత్రం అది కాంగ్రెస్ తప్పు అన్నట్లుగా మాట్లాడడం సరైంది కానది సహకార కార్పొరేషన్ ఛైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి పేర్కొన్నారు. వేల్పూర్ మండల కేంద్రంలో ఆదివారం వేల్పూర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సారెడ్డి తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజనలను మభ్యపెట్టడం ఎంపీకే చెల్లిందన్నారు. స్థానిక పార్లమెంట్ సభ్యుడు అర్వింద్ ఇటీవల బోధన్‌లో జరిగిన సంఘటనలో ఉగ్రవాది పట్టుబడితే.. ఆ ఘటనను కాంగ్రెస్ పార్టీకి అంటగడ్డడం ఆయన మతిలేని స్థితికి పరాకాష్ట అని పేర్కొన్నారు. మరో పక్క స్థానిక ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి యూరియా కొరతపై మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా సరఫరా చేయడంలో విఫలమైందని చెప్పడం తీవ్రంగా ఖండిస్తున్నామని మానాల పేర్కొన్నారు. యూరియా కేంద్రం నుంచి వస్తుందని ఆయనకు పదేళ్లుగా తెలుసుండి కూడా ఇలా మాట్లాడడం ఆయన అవివేకమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ ఛైర్మన్ కుంట రమేష్ రెడ్డి, మండల అధ్యక్షుడు గడ్డం నర్సారెడ్డి, మల్లేష్, జిల్లా జనరల్ సెక్రెటరీ దామోదర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ నరేందర్, బీసీ మండల్ ప్రెసిడెంట్ రమణ, కిసాన్ సెల్ మండల ప్రెసిడెంట్ రవి, భగవాన్ దాస్, మహేందర్, రమేష్, మల్లయ్య, రాజేశ్వర్, జేమ్స్ గంగారెడ్డి, రాజేందర్, కిరణ్ గౌడ్, జంగన్న, రమేష్, మైలారం గంగారెడ్డి, జంగన్న పాల్గొన్నారు.

## ప్రతి హిందువు స్వయం సేవక్‌గా తయారు కావాలి





**అక్షరటుడే, ఇందూరు :** ప్రతి హిందువును స్వయంసేవక్‌గా తయారు చేయడమే శతాబ్ది ఉత్సవాల లక్ష్యమని ఆర్ఎస్ఎస్ జిల్లా సంఘ్ చాలక్ డాక్టర్ కాపర్తి గురుచరణం అన్నారు. ఆర్ఎస్ఎస్ కంఠేశ్వర్, నాందేవ్‌వాడ ఉపనగరాల సాంఘిక్ కార్యక్రమం న్యూ హౌసింగ్ బోర్డ్ కాలనీలోని కమ్యూనిటీ హాల్లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విజయదశమి నుంచి ఏడాది పాటు ప్రతి హిందూ ఇంటిని కలవడం, ఆర్ఎస్ఎస్ చేస్తున్న కార్యక్రమాల గురించి వివరిస్తామన్నారు. వ్యక్తి మారితేనే సమాజం మారుతుందని ఆర్ఎస్ఎస్ వ్యవస్థాపకులు డాక్టర్ హెడ్గేవార్ సూచించారని గుర్తు చేశారు. ప్రతి వ్యక్తిని దేశభక్తుడిగా.. శ్రేష్టమైన హిందువుగా తీర్చిదిద్దడం లక్ష్యంగా వందేళ్ల ప్రయాణాన్ని కొనసాగించామన్నారు. వ్యక్తి బాగుంటే కుటుంబం.. కుటుంబం బాగుంటే సమాజం.. సమాజం బాగుంటే దేశం బాగుంటుందని మూల సూత్రాన్ని అర్థం చేయించడానికి దేశవ్యాప్తంగా జన జాగరణ చేయనున్న పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నగర కార్యవాహ అర్గుల సత్యం, నగర ఉప కార్యవాహ మధుకర్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా మిలాద్ ఉన్ నబీ ర్యాలీలు

**మిలాద్ ఉన్ నబీని ఉమ్మడి జిల్లాలో ఘనంగా జరుపుకున్నారు. నిజామాబాద్ నగరంతో పాటు బాన్సువాడ, తదితర ప్రాంతాల్లో భారీ ఎత్తున ర్యాలీలు తీశారు. ఈ సందర్భంగా మతపెద్దలు మహమ్మద్ ప్రవక్త సూక్తులను వివరించారు. పెద్దమొత్తంలో మైనార్టీలు ఈ ర్యాలీలో పాల్గొన్నారు.**

- అక్షరటుడే, నెట్‌వర్క్



కోటగిరిలో..



## గిరిజన ఆశ్రమ పాఠశాలలో హిందీ దివస్ కార్యక్రమం

**అక్షరటుడే, బాన్సువాడ:** పట్టణంలోని గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో మేరా యువ భారత్ ఆధ్వర్యంలో హిందీ దివస్ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ సునీల్ రాథోడ్ మాట్లాడుతూ.. 1949 సెప్టెంబర్ 14న భారతదేశ అధికార భాషగా హిందీ భాషను ప్రకటించినట్లు గుర్తుచేసుకున్నారు. హిందీ భాషను నేర్చుకోవడం ద్వారా దేశంలోని అన్ని రాష్ట్రాల్లో సులభంగా సంభాషణ జరుపుకోవచ్చని, ప్రతిఒక్కరూ హిందీ మాట్లాడడం అలవర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం హిందీ బోధించే ఉపాధ్యాయురాలిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయభారతి, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ నిర్వహించారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు ఆదేశాల మేరకు కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. సదాశివనగర్, రాజంపేట్, రామారెడ్డి, తాడ్వాయి మండలాలకు చెందిన పలువురు దరఖాస్తు చేసుకోగా, 53 మందికి రూ.17,57,500 విలువైన చెక్కులు మంజూరైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. సీఎం ఆర్ ఎఫ్, ఎల్ ఓ సీ చెక్కుల పంపిణీలో ఎల్లారెడ్డి నియోజకవర్గం రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలవడం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రసవత్తరంగా పద్మశాలి వసతిగృహం ఎన్నికలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నగరంలోని పద్మశాలి విద్యార్థి వసతిగృహం ఎన్నికలు రసవత్తరంగా జరుగుతున్నాయి. నగరంలోని పద్మశాలి హైస్కూల్ లో ఆదివారం ఉదయం నుంచి పోలింగ్ ప్రారంభమైంది. ఈ ఎన్నికల్లో శంఖం గుర్తు నుంచి అధ్యక్షుడిగా ఎస్సార్ సత్యపాల్, సూర్యుడి గుర్తు నుంచి దికొండ యాదగిరి, ఏనుగు గుర్తు నుంచి కొండి రమేష్‌లు బరిలో నిలిచారు. ప్రధాన కార్యదర్శి అభ్యర్థులుగా శంఖం గుర్తు నుంచి క్యాతం జగన్మోహన్ సూర్యుడు గుర్తు నుంచి వెంకట నర్సయ్య, ఏనుగు గుర్తు నుంచి భీమర్తి రవిలు ఎన్నికల బరిలో నిలిచారు. పద్మశాలి వసతి గృహానికి మొత్తం 894 సభ్యులు సభ్యత్వం తీసుకున్నారు. ఇందులో మధ్యాహ్నం రెండు గంటల వరకు 75 శాతం పోలింగ్ నమోదైంది. ఇందులో రెండు ఓట్లు ఛాలెంజ్ ఓట్లు నమోదు అయినట్లు ఎన్నికల అధికారి యాదగిరి పేర్కొన్నారు.

## ప్రేమ పేరుతో మోసం..

## యువతి ఆత్మహత్యాయత్నం

**అక్షరటుడే, బాన్సువాడ:** పెళ్లి చేసుకుంటానని నమ్మించి ఓ యువతిని మోసం చేసిన ఘటన వర్ని మండలంలో ఆలస్యంగా వెలుగు చూసింది. వర్ని మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన యువతితో వెంకటేశ్వరక్యాంప్ (కూనీపూర్ క్యాంప్)నకు చెందిన యాదగిరి గత ఐదేళ్లుగా హైదరాబాద్‌లో సహజీవనం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న యువకుడి కుటుంబ సభ్యులు పెద్దల సమక్షంలో పెళ్లి జరిపిస్తామని నమ్మించి వర్ని మండలానికి తీసుకువచ్చారు. పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి యువతి తక్కువ కులానికి చెందిందని, సెటిల్మెంట్ చేసుకుందామని యువతిని ఒప్పించే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో యువకుడిని అజ్ఞాతంలోకి పంపించారు. ప్రేమ పేరుతో తనను మోసం చేశాడని భావించిన యువతి అవమానానికి గురై శుక్రవారం మధ్యాహ్నం ప్రియుడి ఇంటి ముందు గడ్డి మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడింది. ప్రస్తుతం నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. ఈ విషయమై యువతి బంధువులు వర్ని పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



గాంధారి మండలకేంద్రంలోని దుర్గానగర్ కాలనీ 31 వసంతాలు పూర్తి చేసుకుంది. అప్పటి కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన శాఖ మంత్రి పీఏ సంగ్మా ఈ కాలనీని 1994లో ప్రారంభించారు. దీంతో అప్పటి నుంచి ఇప్పటివరకు కాలనీ అభివృద్ధి చెందుతూ వస్తోంది. - అక్షరటుడే, గాంధారి

# ఆ కాలనీకి 31 వసంతాలు..!

▸ ఏటా పెరుగుతున్న భూముల ధర ▸ దుర్గానగర్ కాలనీలో గజం రూ.20వేలకుపైనే..

అప్పట్లో గజం స్థలం విలువ రూ.2వేలు ఉంటే, ఇప్పుడు ఏకంగా రూ.20వేలకు పెరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఉన్న నారా చంద్రబాబు నాయుడు చేతులమీదుగా 54 మంది బీడీ కార్మికులకు ఇళ్లు నిర్మించుకునేందుకు ఈ స్థలాన్ని కేటాయించారు. ప్రభుత్వమే రుణం మంజూరు చేసి ఇళ్లు నిర్మించి ఇచ్చింది. అంతేగాక, ప్రతి ఇంటికి మరుగుదొడ్డి సౌకర్యం కూడా కల్పించారు. కాలనీ ఏర్పడే క్రమంలో 54 మంది లబ్ధిదారులు రూ.1600 చొప్పున సేకరించి, కాలనీకి రాకపోకలకు దారి కోసం మరో రూ.200 చొప్పున సేకరించి సౌకర్యాలు ఏర్పాటు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అప్పటి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వర్క్ బోర్డు ఉర్దూ అకాడమిక్ శాఖ మంత్రిగా ఉన్న మహమ్మద్ అలీ షబ్బీర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మికశాఖ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ, పార్లమెంట్ సభ్యులు మెదక్ బాగారెడ్డి, నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు గంగారెడ్డి, రాజ్యసభ సభ్యులు కేఎం ఖాన్, శాసనసభ్యులు ఎల్లారెడ్డి నేరెళ్ల ఆంజనేయులు ముఖ్యఅతిథిలుగా హాజరయ్యారు. అప్పటి నుంచి కాలనీ అభివృద్ధి చెందుతూనే ఉంది.

### అప్పుడు ఒక్క మాట మీదే ఉండే వారం..



అప్పట్లో మాటకు విలువ ఉండేది. ఏదైనా పని చేద్దామనుకుంటే అందరూ కలిసి ఒకే మాటపై ఉండి చేసేవాళ్లం. అందుకే నేటికీ ఇంకా కొన్ని ప్లాట్లు అలాగే ఉన్నాయి. మున్ముందు కాలనీకి మంచిపేరు తీసుకొచ్చే ప్రయత్నం చేయాలి.

**– పరంధాములు, కాలనీవాసి**

### దొంగల భయం చాలా ఉండేది...



కాలనీ ఏర్పడిన కొన్ని రోజులకు దొంగల భయం చాలానే ఉండేది. కాలనీవాసులే రాత్రిళ్లు కాపలా చేసేవాళ్లం. ఇప్పుడు ఎలాంటి భయం లేకుండా పోయింది. కాలనీ అభివృద్ధికి అందరం కలిసి కృషి చేస్తున్నాం. దాని ఫలితంగానే దుర్గానగర్‌కు మంచి పేరు వచ్చింది.

**– కుమారస్వామి, కాలనీవాసి**

## రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

**అక్షరటుడే, ఇందల్వాయి:** రైలుకింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సిర్నాపల్లి-ఇందల్వాయి రైల్వే స్టేషన్ల మధ్య ఆదివారం చోటు చేసుకుంది. రైల్వే ఎస్సై సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గన్నారం గ్రామానికి చెందిన ఎడ్లరవి (45) సిర్నాపల్లి -ఇందల్వాయి రైల్వే స్టేషన్‌ల మధ్య రైతుల కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వ్యక్తిగత కారణాలతో ఆయన ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలుస్తోంది. మృతుడికి భార్యా ఇద్దరు కుమారులు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


## బాధిత కుటుంబాలకు పరామర్శ



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** మండలంలోని పలు గ్రామాల్లో బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్యాల సునీల్ కుమార్ ఆదివారం పరామర్శించారు. కోనాపూర్‌కు చెందిన బడాల లింగారెడ్డి, తెడ్డు గంగారాం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, సానుభూతి తెలిపారు. అలాగే మండలంలోని కోన సముందర్‌లో గుండెపోటుతో మృతి చెందిన భిక్షపతి, అనారోగ్యంతో మృతిచెందిన బద్దం కిషన్ కుటుంబీకులను పరామర్శించారు. ఆయన వెంట మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

## అదుపు తప్పి లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

**అక్షరటుడే, ఇందల్వాయి:** నారింజ పండ్ల లోడుతో వెళ్తున్న లారీ బోల్తా పడింది. దీంతో రోడ్డంతా పండ్లు చెల్లాచెదురయ్యాయి. ఈ ఘటన నిజామాబాద్ జిల్లా ఇందల్‌వాయి మండలం చంద్రాయన్‌పల్లి శివారులో 44వ నంబరు జాతీయ రహదారి 44 పై చోటుచేసుకుంది. అదుపుతప్పిన లారీ ప్రధాన రహదారిపై 15 మీటర్ల కింద ఉన్న సర్వీసు రోడ్డుపై పడిపోయింది. ఆదివారం (సెప్టెంబరు 14) తెల్లవారుజామున లారీలో సమస్య ఏర్పడి అదుపు తప్పింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ అబ్రాజ్ ఖాన్ స్వల్పంగా గాయపడ్డాడు. మరో వ్యక్తి సుజిత్ కూడా లారీలో ఉన్నాడు. నారింజ పండ్ల లోడుతో ఉన్న లారీ హైదరాబాద్ నుంచి ఢిల్లీ వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. లారీ బోల్తా పడిన సమయంలో సర్వీస్ రోడ్డులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.



## కన్నతల్లిని హత్య చేసిన కొడుకు అరెస్ట్

**అక్షరటుడే, కామారెడ్డి :** అనారోగ్యంతో బాధపడుతూ ఇంట్లోనే అపరిశుభ్రం చేస్తోందని తల్లిని తీసుకెళ్లి నదిలో తోసేసి హత్య చేశాడు ఓ కొడుకు. చివరకు కటకటాలపాలయ్యాడు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర కేసు వివరాలను మీడియాకు వెల్లడించారు. ఈనెల 11న మధ్యాహ్నం బొల్లక్‌పల్లి గ్రామ శివారులోని మంజీర నదిలో గుర్తు తెలియని మహిళ శవం కనిపించిందని, గ్రామపంచాయతీ కార్యదర్శి గంగుల శివాజీ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పిట్లం పోలీస్ స్టేషన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. విచారణలో భాగంగా గుర్తు తెలియని మహిళ మృతదేహం ఫొటోలను సీసీ కెమెరా ఫుటేజీలు సేకరించి, వాట్సాప్ గ్రూపులు, సోషల్ మీడియాలో షేర్ చేసి సమాచారాన్ని అందరికీ చేరేలా చేశారు. 12న ఉదయం బోర్లం గ్రామ పెద్దలు ఒక వ్యక్తి (మైనర్)ను, ఎర్రోళ్ల బాలయ్య ఇద్దరు కలిసి సాయవ్వను ఆస్పత్రికి తీసుకెళ్లారు కదా ఏమైందని అడగడంతో ఆ మైనర్ విషయం చెప్పడం సాయవ్వ హత్య విషయం బయటకు తెలిసింది. మృతురాలు సాయవ్వ కుమారుడు ఎర్రోళ్ల బాలయ్య తన తల్లి ఆరోగ్యం బాగా లేదని, ఇంట్లో అపరిశుభ్రం చేస్తోందనే కోపంతో ఈనెల 8న రాత్రి 9:00 గంటల సమయంలో తన బైక్‌పై బొల్లక్‌పల్లి బ్రిడ్జి వద్దకు తీసుకెళ్లి, బ్రిడ్జ్ మీద నుండి మంజీర నది లోకి తోసివేసి హత్య చేసినట్లు పోలీసులు సమచారం సేకరించారు.

ఆదివారం బాన్సువాడ మండలంలోని కొయ్యగుట్ట చౌరస్తా వద్ద నిందితులు A1ఎర్రోళ్ల బాలయ్య, మైనర్ బాలుడు బోర్లం నుంచి కొయ్యగుట్టకు వస్తుండగా అరెస్టు చేశారు. హత్యలో ఉపయోగించిన బైక్, రెండు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకుని ఎర్రోళ్ల బాలయ్యను రిమాండ్‌కు తరలించామని, మైనర్ బాలుడిని జువైనల్ అబ్జర్వేషన్ హోంకు తరలించినట్లు ఎస్పీ తెలిపారు.



## అంత్యక్రియలకు ఆర్థికసాయం

**అక్షరటుడే, బాన్సువాడ:** నస్రుల్లాబాద్ మండలం నాచుపల్లి గ్రామానికి చెందిన బీజేపీ బూత్ అధ్యక్షుడు బండపల్లి శ్రీను తండ్రి ఆదివారం మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ సున్నం సాయిలు కార్యకర్తలతో కలిసి వెళ్లి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. అనంతరం అంత్యక్రియల నిమిత్తం కుటుంబానికి రూ.4,600 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల సీనియర్ నాయకులు అనుసూరి శ్రీనివాస్, అరిగె నారాయణ, పెర్క రాములు, గొడిసెల యాదగిరి గౌడ్, మనూర్ సాయిలు, ర్యాపని మహేష్, కొప్పుల సాయిలు, జల్ల సాయి పాల్గొన్నారు.



## ప్రభుత్వ బాలికల కళాశాలలో స్వచ్ఛ భారత్

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని శాస్త్రినగర్ లో ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో ఆర్మూర్ మహాత్మ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కళాశాల ఆవరణలో పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలను తొలగించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకె శ్రీనివాస్, అధ్యాపకులు గంట గంగాధర్, కళాశాల విద్యార్థులు, సంస్థ సభ్యులు సుంకె నిశాంత్ ప్రశాంత్, శ్యాసుందర్, గణేష్, ముధుసుధన్, గుర్రం రాకేష్, వంట నరేష్, వేణు, పట్వారీ తులసీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



## డిచ్‌పల్లిలో ఘనంగా ఊర పండగ

**అక్షరటుడే, డిచ్‌పల్లి:** డిచ్‌పల్లి మండలకేంద్రంతోపాటు కమలాపూర్, ఘన్‌పూర్ గ్రామాల్లో ఆదివారం ఊర పండుగ ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో గ్రామ దేవతల విగ్రహాలను డప్పు వాయిద్యాల నడుమ నృత్యాలు చేస్తూ, ఊరేగింపు చేపట్టారు. అనంతరం గంగాజలంతో అభిషేకం జరిపారు. ఆలయాల్లో భక్తులు గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఊరేగింపు సందర్భంగా పోతరాజుల విన్యాసాలు అలరించాయి. అనంతరం గ్రామదేవతలకు బలిహరణ నిర్వహించారు. గ్రామస్తులంతా పాడి,పంటలతో సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని మొక్కులు చెల్లించుకున్నారు.



## ఇందల్వాయి, తిర్మన్ పల్లిలో ఘనంగా ఊర పండగ

**అక్షరటుడే, ఇందల్వాయి:** మండలంలోని తిర్మన్ పల్లి, త్రయంబక్ పేట్ గ్రామాల్లో ఆదివారం ఊర పండగ ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల గ్రామాభివృద్ధి కమిటీల ఆధ్వర్యంలో గ్రామ దేవతలను ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాడి పంటలు బాగుండాలని, అందరూ ఆయురారోగ్యాలతో సమృద్ధిగా ఉండాలని మొక్కుకున్నారు. ఏటా ఊర పండుగ ఘనంగా నిర్వహిస్తామని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామ చావడి వద్ద బలిహరణం చేసిన అనంతరం బంధుమిత్రులతో కలిసి వన భోజనాలకు వెళ్లారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.